సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



మూడు నెలలుగా వేతనాల్లేవ్

ప్రభుత్వాస్పత్రుల్లో వేతనాలు అందక కాంట్రాక్ట్ కార్మికులు అల్లాడుతున్నారు. అప్పులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నామంటూ **ఆవేదన చెందుతున్నారు.** 8లో ▸



విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం ఓ రైతు ప్రాణాన్ని బలిగొంది. నిమ్మలగూడెంలో విద్యుత్ కనెక్షన్ కలిపే పనుల్లో విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం పాలయ్యాడు. 8లో ▸



నలుగురి అరెస్ట్

పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి బంగారం, భారీగా వెండి **స్వాధీనం చేసుకున్నారు.** 8లో ▸

వైద్య విద్యపై కూటమి కత్తి

మెడికల్ కళాశాలలకు మంగళం !

- ఏలూరుకే తలమానికంగా ప్రభుత్వ వైద్య కళాశాల
- గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు
- మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న 150 మంది విద్యార్థులు
- కౌన్సెలింగ్ పూర్తయితే మరో 150 మందికి అవకాశం
- వైద్య కళాశాలల ప్రైవేటుపరానికి సర్కారు యత్నాలు
- పాలకొల్లు కళాశాల నిర్మాణంపై నీలినీడలు



ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కళాశాల

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రభుత్వ వైద్య కళాశాల.. దశాబ్దాల ఏలూరువాసుల కల.. వైద్య కళాశాల సాకారం.. ఈ ప్రాంతానికే తలమానికం.. దాదాపు 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఏలూరు మెడికల్ కాలేజీ గతేడాది సాకారమైంది. గత జగన్ ప్రభుత్వంలో కేంద్రానికి ఆగమేఘాలపై ప్రతిపాదనలు పంపడం, అనుమతులు మంజూరు చేయించుకోవడం, నిర్మాణం పూర్తిచేసుకుని తరగతుల నిర్వహణ ప్రారంభించడం అన్నీ రెండేళ్లలో చకచకా జరిగిపోయాయి. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో కొత్త వైద్య కళాశాలలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే పాలకొల్లులో ప్రభుత్వ వైద్య కళాశాల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు దారాదత్తం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తూ పేద విద్యార్థులకు అన్యాయం చేయడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 12,500 మంది విద్యార్థులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇంటర్ బైపీసీ విద్యార్థులు సుమారు 12,500 మంది ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది మెడిసిన్‌కు ప్రాధాన్యమిస్తారు. వందలాది మంది లాంగ్‌టర్మ్ శిక్షణ పొందుతూ సీటు సాధిస్తుంటారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలు వరం లాంటివి. ప్రైవేటు వైద్యకళాశాల్లో ఎన్నారై కోటా, సెల్ఫ్‌ఫైనాన్స్ కోటా సీట్ల కోసం రూ.కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ పరిణామాల క్రమంలో గత ప్రభుత్వం రాష్ట్రంలో ఏకకాలంలో 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు, పాలకొల్లులో వైద్య కళాశాలలను మంజూరు చేసింది.

తొలి ఏడాది 150 సీట్లతో.. 2023–24 విద్యా సంవత్సరంలో ఏలూరు కళాశాలలో 150 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి రూ.525 కోట్లతో ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో టీచింగ్ హాస్పటల్, కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని డీఎంహెచ్‌ఓ కార్యాలయం ప్రాంగణంలో రూ.60 కోట్ల వ్యయంతో జీప్లస్–5 భవనం, ల్యాబ్‌లు, హాస్టళ్ల నిర్మాణాలు పూర్తిచేశారు. గతేడాది సెప్టెంబర్ 2న కళాశాల ప్రారంభం కాగా ఫస్టియర్ పూర్తయి విద్యార్థులు సెకండియర్‌లోకి వచ్చారు. మరలా 150 సీట్లు ఈ ఏడాది నీట్ ద్వారా భర్తీ కావాల్సి ఉంది.

పాలకొల్లులో పనులకు బ్రేక్

పాలకొల్లులో రూ.475 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణ పనులనూ గత జగన్ ప్రభుత్వం ప్రారంభించింది. పాలకొల్లు మండలం దగ్గులూరులో 60 ఎకరాల విస్తీర్ణంలో పనులు చేపట్టగా కూటమి ప్రభుత్వంలో ఇవీ అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మూడు నెలలుగా పనులను కన్నెత్తి చూసే నాథుడే లేడు. కాంట్రాక్టర్లు అక్కడ సామగ్రిని వేరే ప్రాంతానికి తరలించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్న క్రమంలో పాలకొల్లు కళాశాల భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అనుమతులన్నీ మంజూరై నిర్మాణాలు ప్రారంభమైన కళాశాల కనుమరుగయ్యే ప్రమాదంపై పలు వర్గాలు మండిపడుతున్నాయి.

విద్యార్థుల ఆశలపై నీళ్లు



వైద్య విద్యను అభ్యసించాలనే విద్యార్థుల ఆశలపై చంద్రబాబు సర్కార్ నీళ్లుచల్లుతోంది. వైద్య కళాశాలలకు అనుమతులు రాకుండా ప్రైవేటును ప్రోత్సహించేలా చంద్రబాబు యత్నిస్తున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది 700 మందికి వైద్యవిద్యను దూరం చేశారు. ఎన్ఎంసీ సీట్లు మాకు వద్దంటూ రాష్ట్ర ప్రభుత్వమే లేఖ రాయడం దౌర్భాగ్యం. జగన్ ప్రభుత్వ హయాంలో తలపెట్టిన 17 వైద్య కళాశాలలను ప్రైవేటుకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం విద్యార్థుల పాలిట శాపంగా మారింది.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

వైద్య రంగం నిర్వీర్యం



రాష్ట్రంలో వైద్య కాలేజీల నిర్మాణాన్ని చంద్రబాబు అడ్డుకోవడం సరైంది కాదు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తే పేదలంపై భారం పడుతుంది. గత ప్రభుత్వంలో జగన్ కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. దీంతో రాష్ట్రానికి అదనంగా 1,800 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఆశలు నిరాశలు చేస్తూ ప్రైవేట్ పరం చేసే ఆలోచనను విరమించుకోవాలి. నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ప్రభుత్వ సీట్లు అందుబాటులో ఉంచాలి.

– దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు

ఇది చాలా దారుణం



గత ప్రభుత్వం వేల కోట్ల నిధులతో వైద్య కళాశాలల ఏర్పాటుకు సంకల్పించింది. గత ప్రభుత్వ హయాంలో సగం పూర్తి చేసిన కళాశాలల పనులను పూర్తి చేసి ఆ ఘనతను తన ఖాతాలో వేసుకునే వెసులుబాటు ఉన్నా ప్రస్తుత ప్రభుత్వం కళాశాలల నిర్మాణాన్ని అటకెక్కించడంలో ఆంతర్యం ఏమిటో బోధపడటం లేదు. వైద్య విద్యను చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాల్సింది పోయి ఉన్న అవకాశాలను దెబ్బతీయడం దారుణం.

– బి.చందన్, విద్యార్థి

వైద్యుల అవసరం లేదా?



రాష్ట్రంలో కొత్తగా వైద్య కళాశాలలు ఏర్పాటుచేస్తే నాలాంటి ఎందరో విద్యార్థులకు మేలు. కొత్త కళాశాలల్లో కొన్ని ఇప్పటికే ప్రారంభం కాగా ఎందరో తెలుగు విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం వ్యవహారం చూస్తుంటే రాష్ట్రానికి వైద్యుల అవసరమే లేనట్టుగా కనిపిస్తోంది. ఇప్పటికే రోగులకు సరిపడే నిష్పత్తిలో వైద్యులు లేక సరైన వైద్యం సమయానికి అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం వైద్య కళాశాలలకు మోకాలడ్డటం సరికాదు.

– వై.భరత్ చంద్, లాంగ్ టర్మ్ విద్యార్థి



ఏలూరు మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు (ఫైల్)

ప్రభుత్వం పునరాలోచించాలి



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్వాకం వల్ల డాక్టర్ చదవాలనే ఆశతో ఉన్న విద్యార్థులకు మొండిచేయి చూపడం తగదు. మా అమ్మాయి ఎంబీబీఎస్ సీటు సాధించి డాక్టర్ కావాలని కలలు కంటోంది. అయితే చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు కొమ్ము కాస్తుండటంతో గత ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాలలకు కేంద్రం అనుమతులివ్వకుండా మోకాలడ్డింది. దీని వల్ల వేలాది మంది డాక్టర్ చదువుకు దూరమవుతారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించాలి.

–అద్దంకి బ్రహ్మాజీ, సీతారామపురం సౌత్

న్యూస్‌రీల్

కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు

సాక్షి స్పందన

భీమవరం (ప్రకాశం చౌక్): వరదలు, వర్షాల కారణంగా పెరుగుతున్న కూరగాయల ధరలతో సామాన్యు ఇబ్బందులు పడుతున్నారని 'కూరగాయల ధరలకు రెక్కలు' శీర్షికన ఈనెల 9న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి స్పందించారు. బహిరంగ మార్కెట్‌లో ధరలకు సంబంధించి వ్యాపారులు, రైతుల బజార్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. కూరగాయలు ధరలు అందుబాటులో ఉండాలని, హోల్‌సేల్ ధరలకే అన్ని దుకాణాల్లో విక్రయించేలా చర్యలు తీసుకోవాలని, రైతుబజార్లలో తక్కువ ధరలకు విక్రయించేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. కూరగాయల ధరల పట్టికను నిర్ణయించారు. భీమవరం రైతుబజార్‌లో ధరలు ఇలా కిలో టమోటా రూ.32, బీరకాయలు రూ.50, బంగాళాదుంప రూ.40, ఉల్లి రూ.55, పచ్చిమిర్చి రూ.32, దొండకాయలు రూ.36, క్యారెట్ రూ.36, క్యాబేజీ రూ.32, వంగ రూ.60, కాకరకాయలు రూ.36, బెండకాయలు రూ.56, దోస రూ.35.

13 నుంచి ఈఎన్‌టీ వైద్యుల రాష్ట్ర సమావేశాలు



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

భీమవరం: భీమవరంలో ఈనెల 13 నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వైద్యుల వార్షిక సమావేశాలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఈఎన్‌టీ వైద్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నడింపల్లి శంకర్‌కుమార్ వర్మ, డాక్టర్ బాపారావు చెప్పారు. గురువారం భీమవరంలో విలేకరులతో మాట్లాడుతూ రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్లో నిర్వహించే వార్షిక సమావేశాలకు సుమారు 700 మంది వైద్యులు హాజరవుతారన్నారు. 13న ముంబై, కోల్‌కతా, జైపూర్ వైద్యులు, 14,15 తేదీల్లో చెన్నై, బెంగళూరు, కోయంబత్తూరు, న్యూఢిల్లీ, రాయవెల్లూరు, మణిపాల్, ఏపీ, తెలంగాణ ప్రాంతాలకు చెందిన వైద్యులు హాజరవుతారన్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి గొట్టుముక్కల బాలకృష్ణంరాజు, కోశాధికారి ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలు

భీమవరం: మహాత్మా గాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్టు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం తెలిపారు. గాంధీతత్వం–నేటి భారతం అనే అంశంపై ఏ4 సైజు డ్రాయింగ్ షీట్‌పై చిత్రాన్ని వేసి స్కాన్ చేసి మెయిల్‌కు పంపించాలన్నారు. ఈనెల 21లోపు పంపిన వాటిలో ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా బహుమతులు అందిస్తామన్నారు. వివరాలకు సెల్ 99490 93115లో సంప్రదించాలని ప్రసాదరాజు తెలిపారు.

358 మందికి 'మిషన్ వాత్సల్య'



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణాధికారి

ఆకివీడు: మిషన్ వాత్సల్య పథకం ద్వారా నెలకు రూ.4 వేల చొప్పున 2023–24కు సంబంధించి జిల్లాలో 358 మంది బాలలకు రూ.85.92 లక్షల నిధులు మంజూరైనట్టు జిల్లా బాలల సంరక్షణాధికారి ఆర్.రాజేష్ తెలిపారు. ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అనాథ బాలలు, సంరక్షకులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజేష్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో తల్లిదండ్రుల్ని కోల్పోయిన పిల్లలు, అనాథ పిల్లల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకం ద్వారా సాయం అందిస్తోందన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వి.వాణీ విజయరత్నం, ఈఓపీఆర్‌డీ సుబ్బారావు పాల్గొన్నారు.

దాతల సహకారం స్ఫూర్తిదాయకం

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడ వరద బాధితులకు దాతలు అందిస్తున్న సాయం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం తాడేపల్లిగూడెం విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి రూ.2,60,500లు, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) భీమవరం డివిజన్ తరపున రూ.1,26,069లు చెక్కులను కలెక్టర్‌కు అందజేశారు.

14న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 3వ జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 14న నిర్వహించనున్నట్టు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ తెలిపారు. జిల్లా కోర్టులో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 4,543 కేసులను రాజీయోగ్యమైనవిగా గుర్తించామని, వీటి పరిష్కారానికి 33 బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. దూర ప్రాంతాల్లోని వారు ఆన్‌లైన్ ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. గత లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచిందన్నారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్ పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ఏపీ బార్ అసోసియేషన్ సభ్యుడు బీవీ కృష్ణారెడ్డి, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారామ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

అవగాహన కల్పించాలి

ఏలూరు టౌన్: జిల్లాలో ఈనెల 14న చేపట్టే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ అన్నారు. ఏలూరులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాజీమార్గం ఉత్తమమని కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఏపీ ఎన్‌జీఓల మద్దతు

ఏలూరు(మెట్రో): జీఓ 85ను రద్దు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తమకు మద్దతు ఇవ్వాలని ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ నాయకులను ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం ఏలూరు ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో డాక్టర్స్ అసోసియేషన్ సెక్రటరీ కిషోర్ ఆధ్వర్యంలో ఏపీ ఎన్‌జీఓస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావుకు వినిపత్రం అందజేశారు. వైద్యులు మాట్లాడుతూ ఇన్ సర్వీసులో పీజీ చేయడానికి గతంలో ఉన్న 30 శాతం కోటాని రద్దు చేస్తూ ఇచ్చిన జీఓ 85 ద్వారా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులకు ఉన్న వెసులుబాటును రద్దు చేశారని, దీనిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ల సమస్యలు పరిష్కారానికి దశల వారీ కార్యక్రమాలకు ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ మద్దతు తెలుపుతున్నట్టు శ్రీనివాస్ తెలిపారు.

పెంచికలమర్రు వద్ద పడవ ఏర్పాటు

సాక్షి స్పందన

కైకలూరు: వరద నీటిలో ఏడు నెలల బాలుడితో ఓ తల్లి పెంచికలమర్రు నుంచి కొట్టాడ వెళుతుండగా 'కొల్లేరు.. కన్నీరు' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. కైకలూరు రూరల్ ఎస్సై వి.రాంబాబు పెంచికలమర్రు వద్ద పడవను ఏర్పాటుచేసి ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేరుస్తున్నారు. పోలీసు పికెట్‌ను కూడా ఏర్పాటు చేశారు. అత్యవసర సేవలకు పోలీసులను సంప్రదించాలని ఎస్సై రాంబాబు కోరారు.



పెంచికలమర్రు వద్ద ఏర్పాటు చేసిన బోటు

లంకలను ముంచుతూ ప్రవాహం



యలమంచిలి: కనకాయలంకలో జలమయమైన వీధి




పెనుగొండ: ఆచంట మండలం పెదమల్లంలో..

ఎగువ నుంచి ఉరకలెత్తుతూ వస్తున్న జలాలతో వశిష్ట గోదావరి సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది. లంక భూములను వరద నీరు ముంచెత్తుతోంది. జిల్లాలోని ఆచంట, పెనుగొండ, యలమంచిలి, నరసాపురం మండలాల్లోని పలు లంక గ్రామాలను వరద చుట్టుముట్టింది. ఆచంట మండలం అయోధ్యలంకలోని పంచాయతీ కార్యాలయం, రామాలయం, యలమంచిలి మండలం కనకాయలంక, పెదలంక, దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం గ్రామాల్లో వరద నీరు చేరింది. కనకాయలంక వద్ద కాజ్‌వేపై సుమారు నాలుగు అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తుండటంతో స్థానికులు పడవల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు.

– సాక్షి, భీమవరం



యలమంచిలి: కనకాయలంక వద్ద పడవపై కాజ్‌వే దాటుతున్న ప్రజలు



నరసాపురం: వలంధర్ రేవు వద్ద ఉధృతి

క్లుప్తంగా

ఆట్యా-పాట్యా జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా క్రీడాకారులు

భీమవరం: భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎమ్ స్కూల్లో గురువారం బాలుర ఆట్యా-పాట్యా జిల్లా జట్టును ఎంపిక చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనగా ఎం ఆదిత్య వెంకటదుర్గ, డి.ప్రసాద్, పి గోపీకృష్ణ, జె లోకేష్, డి మోహన్‌కుమార్, ఎస్ దేవేంద్ర, జి యశ్వంత్‌రమణ, డి లోకేష్, డి పూర్ణప్రసాద్, జి నిఖిల్‌వర్మ, కె శ్రీనివాసు, కె ధనుష్ ఎంపికయ్యారని ఆట్యా పాట్యా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంతెన రామచంద్రరాజు ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14.15 తేదీల్లో కర్నూల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారుల ఎంపికలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి కిరణ్‌వర్మ, స్కూల్ హెచ్‌ఎం బి శ్రీనివాసరావు, పీడీలు జీపీసీ శేఖర్‌రాజు, డీవీ రామభద్రరాజు పాల్గొన్నారు.

భార్య హత్యకేసులో భర్త అరెస్ట్

ఉండి: ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి ఉండి మండలం కలిగొట్ల గ్రామంలో గొల్ల సత్యవతిని చంపిన ఆమె భర్త చిరంజీవిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఉండి శివారు గోరింతోటకు చెందిన గొల్ల చిరంజీవి తన భార్యను హత్య చేసిన అనంతరం తాను ఎలుకల మందు తాగి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆంధ్రా సుగర్స్ విరాళం రూ. 2 కోట్లు



సీఎంకు చెక్కు అందిస్తున్న సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య

తణుకు అర్బన్: వరద బాధితుల సహాయార్థంది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ సంస్థ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2 కోట్లు విరాళం అందజేసింది. సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుత రామయ్య గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అమరావతిలో కలిసి రూ.2 కోట్ల చెక్కును అందజేసినట్లు సంస్థ తెలిపింది. ఇటీవల వరదల సమయంలో తమవంతు సాయంగా 10 వేల ఆహార పొట్లాలను పంపిణీ చేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు.

మూడు నెలల నుంచి వేతనాల్లేవ్..

- సర్కారు దవాఖానాల్లో వేతనాలు అందక అల్లాడుతున్న కాంట్రాక్ట్ కార్మికులు
- అప్పులు చేసి రోజులు గడుపుతున్నామంటూ ఆవేదన
- జిల్లాలో ఇబ్బంది పడుతున్న 260 మంది కాంట్రాక్ట్ కార్మికులు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద వేతనాలు ఇప్పించాలంటూ నినాదాలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, యూనియన్ నాయకుడు భీమారావు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులు

తణుకు అర్బన్: సర్కారు దవాఖానాల్లో వైద్యసేవలకు సంబంధించి విధుల్లో ఉన్న కాంట్రాక్టు కార్మికులు గత మూడు నెలలుగా వేతనాలు లేక అల్లాడుతున్నారు. అసలే అంతంతమాత్రం వేతనమని అది కూడా 3 నెలలు పెండింగ్ పెట్టారంటూ గగ్గోలు పెడుతున్నారు. వేతనాలు అందకపోవడంతో అప్పులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రి, పాలకొల్లు, నరసాపురం, భీమవరంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు, మండల హెడ్ క్వార్టర్స్‌లో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధుల్లో ఉన్న కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గత 3 నెలలుగాను, సెక్యూరిటీ గార్డులకు గత 2 నెలలుగాను వేతన బకాయిలు ఉన్నాయని చెబుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల వేదన

వైద్యసేవలకు సంబంధించి ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో వచ్చే వ్యర్థాలతోపాటు వివిధ వార్డుల్లో వచ్చే వ్యర్థాలను తొలగించడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలకంగా పనిచేస్తుంటారు. రక్తపు వ్యర్థాల తొలగింపులో రోగాల బారిన పడుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లోనే విధుల్లో ఉండాల్సి వస్తుందని, అయినప్పటికీ ఏ నెల వేతనం ఆ నెల ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 260 మంది కాంట్రాక్ట్ కార్మికులు

జిల్లాలోని సర్కారు ఆస్పత్రుల్లో 150కిపైగా పారిశుద్ధ్య కార్మికులు ఉండగా, 110 మంది సెక్యూరిటీ సిబ్బంది విధుల్లో ఉంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పారిశుద్ధ్య కార్మికులకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి వేతనాలు ఇవ్వాలి ఉంది. అయితే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.8 వేలు ఉన్న వేతనాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.14,450కు పెంచి పీఎఫ్, ఈఎస్‌ఐ కటింగ్‌లుపోను రూ.11,858 వేతనం అందించిది. సెక్యూరిటీ గార్డులకు సంబంధించి జూలై, ఆగస్టు నెలలకు వేతనాలు ఇవ్వాల్సిఉండగా, రూ.10వేలు వేతనానికి సంబంధించి పీఎఫ్, ఈఎస్‌ఐ కటింగ్‌లు పోను రూ.8 వేలు వేతనం అందుతుందని సిబ్బంది చెబుతున్నారు. చాలీచాలని వేతనాలతోనే పనిచేస్తున్నామని కానీ ఆ వేతనం కూడా సమయానికి ఇవ్వడంలేదని వాపోతున్నారు.

ఏ నెల వేతనం ఆ నెలలోనే ఇవ్వాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం ఇవ్వకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ వేతనానికి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ వేతనం కూడా ప్రతి నెలా ఇవ్వకుండా ఇప్పటికి మూడు నెలలు పెండింగ్ ఉంచడం ఎంతవరకు సబబు. పారిశుద్ధ్య కార్మికులకు మూడునెలలు, సెక్యూరిటీ గార్డులకు రెండు నెలలు వేతన బకాయిలు పడ్డాయి. వెంటనే వారి బకాయిలు పూర్తిగా చెల్లించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

– కోనాల భీమారావు, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు

దాడి కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

ఏలూరు (టూటౌన్): దాడి కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడు సంవత్సరాల 15 రోజులు సాధారణ జైలు శిక్ష, రూ.6,500 జరిమానా విధిస్తూ ఏలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కం జుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి ఎస్ వాసుదేవ్ గురువారం తీర్పును వెలువరించారు. దీనికి సంబంధించి ఏలూరు వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు సత్యనారాయణపేటకు చెందిన బడి గంటల లీల రాజు అనే వ్యక్తికి వేరొకరి భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఇదేమిటని ప్రశ్నించిన వ్యక్తి చేయి విరగ్గొట్టి, చంపుతానని బెదిరించాడు. దీనిపై 2022 సెప్టెంబర్ 22వ తేదీన ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్సై ఎస్.రామకృష్ణ ఈ కేసు దర్యాప్తు చేసి చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. తుది వాదనలు పూర్తయిన తర్వాత జడ్జి వాసుదేవ్ ముద్దాయి లీల రాజుకు శిక్ష విధిస్తూ తుది తీర్పును వెలువరించారు. ఈ కేసులో ఏపీపీ హేమలత వాదనలు వినిపించారు. ఏలూరు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సై మదీనా బాషా, కోర్టు కానిస్టేబుల్ సంగయ్య సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టి ముద్దాయికి శిక్ష పడేటట్లు సహకరించారు.

ప్రాణాలు బలిగొన్న విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

నిమ్మలగూడెంలో విద్యుదాఘాతంతో రైతు మృతి



నాగరాజు (ఫైల్)



తండ్రి మరణంతో కన్నీటి పర్యంతమవుతున్న కుమారుడు జ్యోతిరాదిత్య

జంగారెడ్డిగూడెం రూరల్: విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం ఒక రైతు ప్రాణాన్ని బలిగొంది. నిమ్మలగూడెంలో గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. నిమ్మలగూడెంలో రైతు కంకిపాటి నాగరాజు (51), మరో రైతు బుగ్గా సత్యనారాయణలకు ఉమ్మడి విద్యుత్ మోటారు ఉంది. ఇటీవల పొలంలో చెట్లు తొలగించే క్రమంలో మోటారుకి వెళ్లే విద్యుత్ సర్వీస్ వైర్ కనెక్షన్ తొలగించారు. తరువాత మోటార్‌కి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని రైతులు విద్యుత్ శాఖ అధికారులకు అభ్యర్థించడంతో గురువారం కనెక్షన్ కలిపే పనులు చేపట్టారు. పనుల్లో భాగంగా హెల్పర్ లైన్‌మెన్‌కి సమాచారం ఇచ్చి ఎల్‌సీ తీసుకున్నారు. ఈ క్రమంలో వైర్‌ను నాగరాజు, అతని కుమారుడు జ్యోతిరాదిత్య, సత్యనారాయణ పట్టుకున్నారు. అయితే కొద్ది సేపటికి ఎల్‌సీ రిటర్న్ ఇవ్వడంతో ఈ ముగ్గురు విద్యుదాఘాతానికి గురయ్యారు. నాగరాజు వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో లక్కవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరు కాసేపటికి తేరుకున్నారు. పనులు పూర్తికాకుండా, పొలంలో పరిస్థితి తెలుసుకోకుండా ఎల్‌సీ రిటర్న్ ఇవ్వడం వలనే నాగరాజు మృతి చెందాడని రైతులు విద్యుత్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనుల వద్ద లైన్‌మెన్ లేకుండా హెల్పర్‌కి అప్పగించడంపై రైతులు, మండిపడుతున్నారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతోనే తన తండ్రిని కోల్పోయానని మృతుడు నాగరాజు కుమారుడు జ్యోతిరాదిత్య కన్నీటి పర్యంతమయ్యాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. మృతుడు నాగరాజుకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రభుత్వ సహాయాన్ని రైతులకు అందించాలి

జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



జెడ్పీ స్థాయి సంఘ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో) : ఇటీవల భారీ వర్షాలు, వరదల వల్ల జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని రైతులకు అందేలాగా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో జెడ్పీస్థాయి సంఘ కమిటీ సమావేశం చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రతి రైతుకు సాయం అందాలన్నారు. అలాగే వివిధ శాఖలకు సంబంధించిన సంక్షేమ పథకాల అమలులో జిల్లా అధికారులు స్ఫూర్తిదాయకంగా పనిచేస్తున్నారని అభినందించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు మాట్లాడుతూ ప్రతినెలా 1వ తేదీనే పింఛన్లు పంపిణీ పూర్తిచేయడం జరుగుతుందన్నారు. నూరుశాతం దివ్యాంగుడై మంచానికే పరిమితమైన దివ్యాంగుల పెన్షన్ రూ.15 వేలు ప్రభుత్వం అందిస్తుందని డీఆర్‌డీఏ పీడీ తెలిపారు. జిల్లాలో హౌసింగ్‌కు సంబంధించి 2014–2019 సంవత్సరంలో ఎన్‌టీఆర్ గృహ యాప్‌లో నమోదు చేసిన బిల్స్‌ను ఆన్‌లైన్ చేస్తున్నామని దీనిని కొత్త స్కీం లో పెట్టడం జరుగుతుందని హౌసింగ్ అధికారులు తెలిపారు. ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో 93.75 లక్షల పని దినాలను కల్పించామని, 3.72 లక్షల మందికి జాబ్ కార్డులు ఇచ్చామని, తమ శాఖ ద్వారా జిల్లాలో పండ్ల తోటలు పెంపకానికి 500 ఎకరాల్లో గ్రౌండ్ లెవల్ చేయడం జరుగుతుందని తెలిపారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ శిథిలమైన దేవాలయాలను పునరుద్ధరించడానికి సీజీఎఫ్ అకౌంట్ కింద ప్రజల భాగస్వాముల నిధులతోపాటు సీజీఎఫ్ అకౌంట్ కింద నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. టీటీడీ ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ దేవాలయాల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఈ సంఘ సభ్య సమావేశంలో వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలు చేస్తున్న పథకాలు, ప్రగతిని సంబంధిత శాఖల అధికారులు తెలియజేశారు. సమావేశంలో తాడేపల్లిగూడెం, చింతలపూడి ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, సొంగా రోషన్ కుమార్, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నిర్మలా జ్యోతి, జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరులో రెండు స్కూటీల దహనం

నిందితుల పరారీ



వేల్పూరు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్యకు ఆహుతైన స్కూటీలు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్, టీడీపీ నాయకుడు రెడ్డి నరేంద్ర ప్రసాద్ ఇంటి ఆవరణలో పార్క్ చేసిన యాక్టివా, జూపిటర్ స్కూటీలను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి దహనం చేశారు. ఈ ఘటనపై బాధితుడు నరేంద్రప్రసాద్ బుధవారం ఉదయం తణుకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తణుకు రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. ఈవిచారణలో భాగంగా సంఘటనా స్థలానికి సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి అనుమానితులను గుర్తించినట్లు చెప్పారు. అనుమానితులు వీరభద్రపురంలోని చికెన్ షాపులో పనిచేసే వ్యక్తులుగా గుర్తించామన్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నట్లు చప్పారు. గతంలో వేల్పూరు పరిసర గ్రామాల్లో గేదెల దొంగతనాలలో నిందితులుగా ఉన్న వారే ఈ దుశ్చర్యకు పాల్పడి వుంటారని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

తణుకు టౌన్ : ఈనెల 11వ తేదీన తణుకులోని ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి తెలిపారు. ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థినులు బీ నాగలక్ష్మి, దుర్గ 500 మీటర్లు, 1500 మీటర్ల విభాగాల్లో ప్రథమ బహుమతితో పాటు డిస్కస్ త్రోలో ద్వితీయ బహుమతిని పొందినట్లు తెలిపారు. అలాగే కె జ్యోతి డిస్కస్ త్రోలో, 200 మీటర్ల పరుగులో ప్రథమ బహుమతి, 1500 మీటర్ల పరుగులో ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా విజేతలను, కళాశాల పీడీ ఎం రత్నకుమారిని కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, జాయింట్ సెక్రటరీ వెంకట కృష్ణారావు అభినందించారు.

'స్వర్ణాంధ్ర' కళాశాలకు ఎన్‌బీఏ టైర్-1 గుర్తింపు



విలేకర్ల సమావేశంలో ఎన్‌బీఏ టైర్-1 గుర్తింపు పత్రాన్ని చూపుతున్న దృశ్యం

నరసాపురం రూరల్: ఎన్‌బిఏ టైర్-1 గుర్తింపు పొందిన అత్యంత గౌరవనీయమైన సంస్థగా నరసాపురం మండలం సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల ఆవిష్కరించిందని కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. కళాశాలలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ విషయాన్ని వారు వెల్లడించారు. జూన్ 21, 22, 23 తేదీల్లో ఎన్‌బీఏ కమిటీ కళాశాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేసిందని, ఫలితంగా తమ కళాశాలకు ఈ గుర్తింపు లభించిందన్నారు. తమ కళాశాలలోని ఈసీఈ, సీఎస్‌ఈ, ట్రిపుల్ ఈ, ఐటీ, మెకానికల్ ఐదు బ్రాంచ్‌లకు ఈ గుర్తింపు లభించడం అరుదైన విషయం అని అన్నారు. సమావేశంలో కోశాధికారి కొండవీటి త్రినాథ్, పాలకవర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి, ప్రసాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గోపీచంద్, హెచ్‌వోడి స్వామినాథన్ తదితరులు ఉన్నారు.

'మినీ గోకులం' ఎంపికలో రాజకీయ విభేదాలు

- జిల్లాకు సుమారు 1,000 మినీ గోకులాల షెడ్ల ఏర్పాటు
- పనికి ఆహార పథకంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు
- మూడు కేటగిరీల్లో రూ.1.15 లక్షల నుంచి రూ.2.30 లక్షల మంజూరు
- టీడీపీ, జనసేన నాయకుల పోటాపోటీ
- నాయకుల మధ్య విభేదాలతో పెద్దల వద్ద పంచాయితీ

భీమవరం : అర్హులందరికీ రాజకీయాలకు అతీతంగా గత ప్రభుత్వం పథకాలను అందించగా నేటి కూటమి ప్రభుత్వంలో రాజకీయ నాయకులు చెప్పిందే వేదంగా మారుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు అధికారులను తమ చెప్పుచేతల్లో పెట్టుకుని తమకు కావల్సినవారికి మేలు చేకూర్చేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా పాడి రైతులకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో సమకూర్చే 'మినీగోకులాలు' ఏర్పాటుకు రాజకీయనాయకులు ప్రత్యేక జాబితాను సిద్ధం చేసి అధికారులతో ఆమోదముద్ర వేయించుకునే పనిలో ఉండగా లబ్ధిదారుల ఎంపికలో టీడీపీ, జనసేన నాయకుల మధ్య విభేదాలు చోటుచేసుకుంటున్నాయి. వ్యవసాయం చేసే రైతులు అదనపు ఆదాయం కోసం పాడి పశువులను పెంచడం పరిపాటి. అయితే ఇటీవల పశువుల దాణాల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రైతుల్లో పశువుల పెంపకం పట్ల ఆసక్తి సన్నగిల్లుతోంది. అయితే పశుసందనను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం పశువులను పెంచే రైతులకు షెడ్లు వేసుకోడానికి కేవలం 10 శాతం రైతు వాటాతో మినీగోకులాల షెడ్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తోంది. పశువులను పెంచే రైతులకు మాత్రమే అందించే మినీగోకులాలు రూ.1.15 లక్షల నుంచి రూ. 2.30 లక్షల వరకు ప్రభుత్వం సహాయం అందిస్తోంది.

రెండు పశువుల మినీ గోకులానికి రూ.1.15 లక్షలు

పశువులను ఎండ, వాన నుంచి కాపాడుకోడానికి షెడ్, నీటి తొట్టె వంటివి ఏర్పాటుచేసుకోవానికి రెండు పశువులను పెంచే రైతులకు రూ.1.15 లక్షలు, 4 పశువులకు రూ.1.85 లక్షలు, 6 పశువులను పెంచే రైతులకు రూ.2.30 లక్షలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. మినీ గోకులాల నిర్మాణం మొత్తం పనికి ఆహార పథకంలో చేయాల్సి ఉంటుంది.

రాజకీయానికే ప్రాధాన్యం..

మినీగోకులాలు పథకంలో లబ్ధి పొందడానికి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, వలస రైతులు అర్హులు. అలాగే మహిళా రైతులు, అంగవైకల్యం ఉన్న యజమాని కుటుంబాలు, చిన్న, సన్నకారు రైతులు వంటివారు అర్హులు. దరఖాస్తు చేసుకునే రైతులు దరఖాస్తు ఫారంతోపాటు ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, స్థలం హక్కుపత్రం, బ్యాంక్ పాస్‌బుక్ జతచేయాల్సి ఉంటుంది. అయితే జిల్లాకు సుమారు వెయ్యి మంది లబ్ధిదారులను ముందుగా ఎంపిక చేయాలని అధికారులు నిర్ణయించడంతో దీనికి రాజకీయ నాయకులు రంగప్రవేశం చేసి తాము చెప్పిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ఒక్కొక్క మండలానికి 50 వరకు మినీగోకులాలు మంజూరయ్యే అవకాశం ఉన్నందున వాటిని గ్రామాల వారిగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పంపకాలు చేసుకుంటున్నారు. అయితే పంపకాల్లో విభేదాలు తలెత్తి కొన్నిచోట్ల పార్టీ పెద్దల వద్ద పంచాయితీలు నిర్వహిస్తున్నారు.

గతంలో పశుసంవర్ధకశాఖ అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేయగా ప్రస్తుతం ఆశాఖను కేవలం దరఖాస్తులు తీసుకోవడానికే పరిమితం చేశారు. లబ్ధిదారుల జాబితాను కలెక్టర్‌కు పంపిస్తే మంజూరు చేసే బాధ్యత కలెక్టర్‌పై. లబ్ధిదారుల ఎంపికకు ముందుగా గ్రామసభలో ఆమోదం పొందాల్సి ఉన్నప్పటికీ రాజకీయనాయకులు తమ కనుసన్నల్లో లబ్ధిదారుల ఎంపిక చేసే విధంగా అధికారులపై వత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగుల బదిలీలు, నియామకాల్లో నాయకులు పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటున్న నేపథ్యంలో కూటమి నాయకుల మధ్య విభేదాలు తలెత్తుతుండగా మినీగోకులాల లబ్ధిదారుల ఎంపిక మరింత రచ్చజరిగే ప్రమాదముందని పార్టీల కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన రైతులకు మినీగోకులాలు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

చోరీ కేసుల్లో నలుగురి అరెస్ట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ప్రతాప శివ కిషోర్



బంగారు, వెండి వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ

115 గ్రాముల బంగారం, భారీగా వెండి స్వాధీనం

ఏలూరు టౌన్: వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడిన నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి బంగారం, భారీగా వెండి స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏలూరు జిల్లా పెదపాడు, ఏలూరు వన్‌టౌన్, నూజివీడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఇంటి దొంగతనాల్లో విజయవాడకు చెందిన పేకేటి వెంకటరెడ్డి, నూజివీడు మండలానికి చెందిన చేకూరి వెంకటరెడ్డి, విజయవాడ కొత్తపేటకు చెందిన షేక్ అల్లా బక్షును అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ ముగ్గురిపై పెదపాడు పోలీస్ స్టేషన్‌లో నాలుగు కేసులు, నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయన్నారు. అలాగే ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన కేసులో ఏలూరు మాదేపల్లి రోడ్డు ప్రాంతానికి చెందిన చింతపల్లి సూర్యకుమార్‌ను అరెస్ట్ చేశామన్నారు. నిందితుల నుంచి 115 గ్రాముల బంగారు అభరణాలు, 4 కేజీల 756 గ్రాముల వెండి, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.13,28,000 ఉంటుందన్నారు. ఈ చోరీ కేసులను దర్యాప్తు చేసిన ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, పెదవేగి సీఐ నబీ, పెదపాడు ఎస్సై శుభశేఖర్, ఏలూరు వన్‌టౌన్ ఎస్సై బాషా, సీసీఎస్ ఎస్సై చంద్రశేఖర్‌ను ఎస్పీ శివకిషోర్ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయాల్లో పోలీసులకు తెలియజేస్తే మీ గృహాలను పోలీస్ సిబ్బంది పర్యవేక్షణ చేస్తారని, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా మీ ఇంటిని పోలీసు సిబ్బంది పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. సమావేశంలో ఏలూరు డీఎస్పీ డీ శ్రావణ్ కుమార్ ఉన్నారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

తాడేపల్లిగూడెం రూరల్: చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని ఆరుగొలను నెం.130 అంగన్‌వాడీ కేంద్రంలో అనుబంధ పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ చిన్నతనం నుంచి సరైన పోషకాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతంగా ఎదుగుతారన్నారు. చిన్నారుల వయస్సుకు తగ్గ ఆహారం అందజేయాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రాణి, జి.సూర్యనాగలక్ష్మి, ఎస్‌కే. ఖాజీ బీ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం(టీఓసీ): పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

పోషకాహారంపై అవగాహన సదస్సు

తాడేపల్లిగూడెం (టీటీసీ): గర్భిణులు, బాలింతలు తప్పక పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ టీఎల్ సరస్వతి పేర్కొన్నారు. పోషకాహార మహోత్సవాలలో భాగంగా పట్టణంలోని 6, 16, 18, 25, 28 వార్డులలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహారంపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. మూడు సంవత్సరాల లోపు పిల్లలకు ఇచ్చే బాలామృతం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దుర్గాభవాని, విశాలాక్షి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం అర్బన్: పలు వార్డుల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పౌష్టికాహారంపై అవగాహన

తణుకు టౌన్: పోషకాహారంతోనే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోగలుగుతామని ఐసీడీఎస్ తణుకు ప్రాజెక్ట్ సీడీపీవో ఎంబీఎస్ ప్రమోద కుమారి తెలిపారు. గురువారం తణుకు మండలం మండపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాలలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. బాలికలలో రక్త హీనత ఎక్కువగా ఉంటుందని దీనిని నివారించాలంటే బాలికలు తమ ఆహారంలో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, పాఠశాల హెచ్ఎం ఆర్ మోహన్‌రావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, విద్యార్థినీలు పాల్గొన్నారు. తణుకు పట్టణంలోని జయంతి కాలనీ, యానాదుల కాలనీలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాలలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం అరుణ కుమారి పాల్గొని మహిళలకు పోషకాహారం గురించి వివరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

పిండి వంటలా బాలామృతం అందించండి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యామ్నాయ పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలలు దాటిన తర్వాత ప్రత్యామ్నాయ ఆహారం అందజేయాలన్నారు. గర్భవతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆకు కూరలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాధారాణి, లక్ష్మి, శేషారత్నం, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే పౌష్టికాహారం అందించాలి

తాడేపల్లిగూడెం అర్బన్: చిన్న పిల్లలందరికీ పౌష్టికాహారాన్ని అందజేయాలని సీడీపీఓ టీఎల్ సరస్వతి సూచించారు. పట్టణంలోని 25, 28, 32 వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మహోత్సవాలను గురువారం నిర్వహించారు. గర్భిణులు ప్రతీరోజు ఆకుకూరలు, పాలు, గుడ్లు వీలైనంత ఎక్కువగా వినియోగించాలన్నారు. చిన్నారులకు తల్లిపాలతోపాటు అదనపు ఆహారం అందజేయాలన్నారు. ఈ సందర్భంగా పోషకాహార మహోత్సవాల అవగాహన ర్యాలీని ఆయా వార్డుల్లో నిర్వహించారు. సూపర్‌వైజర్ కె.విశాలాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

గర్భిణులు ఆహారంలో మిల్లెట్లు ఉండేలా చూసుకోవాలి

అత్తిలి: గర్భిణులు, బాలింతలు తీసుకునే ఆహారంలో మిల్లెట్లు ఉండేవిధంగా చూసుకోవాలని తిరుపతిపురం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా గురువారం అత్తిలి మండలం గుమ్మంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ రోజువారి తీసుకునే ఆహారంలో రాగి, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటి ఆహార పదార్థాలు కలిగి ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతలు తగినంత ఆహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలు నిషేధ చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టాలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి గిరిజ, బి రాజకుమారి, ఆశా వర్కర్లు యు సత్యవతి, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.


తణుకు టౌన్: మండపాక గ్రామంలోని పాఠశాలలో జరిగిన పోషకాహార మాసోత్సవాలలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రమోదకుమారి


అత్తిలి: గుమ్మంపాడులో సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి


తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను నెం.130 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యామ్నాయ పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


అత్తిలిలో మాట్లాడుతున్న డాక్టర్ వి ప్రసాద్

అత్తిలి: మండలంలో ప్రస్తుతం నమోదు అవుతున్న జ్వరాలన్నీ వైరల్ జ్వరాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వి. ప్రసాద్ చెప్పారు. అత్తిలి గ్రామంలో మలేరియా జ్వరంతో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటనపై గురువారం జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, అసిస్టెంట్ మలేరియా అధికారి పి శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు, సబ్‌యూనిట్ అధికారి జి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో అమీలు జమా మృతుల ఇండ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఫీవర్ సర్వే, యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్పేస్‌స్ప్రే కార్యక్రమాలను వారు పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యసిబ్బంది, ఆరోగ్యకార్యదర్శులు, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రతీరోజు ఫీవర్ సర్వే చేయాలని, గుర్తించిన ఫీవర్ కేసులను హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌కు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయి, ఆరోగ్యకేంద్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా వైద్య ఆరోగ్యసేవలు అందించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

అత్తిలి: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడంతో పాటు పరిశుభ్రతను కూడా అలవర్చుకోవాలని డాక్టర్ డి పద్మావతి అన్నారు. గురువారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు చిన్నవయస్సు నుంచే పరిశుభ్రతను అలవర్చుకోవాలన్నారు. పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న ఎస్ అమినాబిబి, రజియాలను హెచ్ఎం, ఉపాధ్యాయులు సత్కరించారు.

క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


రామకృష్ణ ఎరువుల గోదాములో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలోని కడకట్లలోని వాసాబత్తుల రామకృష్ణ, శ్రీకనకదుర్గ ఫెర్టిలైజర్ దుకాణాల్లో గురువారం విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కడకట్లలోని ఎరువుల దుకాణంలో ఎటువంటి అనుమతులులేని రూ.1,82,150లు విలువైన 6.40 మెట్రిక్ టన్నుల ఎరువులను గుర్తించి సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.రామకృష్ణ తెలిపారు. అలాగే కనకదుర్గ ఫెర్టిలైజర్స్‌లో రూ.69,225లు విలువైన 8.10 మెట్రిక్ టన్నుల ఎరువుల్లో వ్యత్యాసాలను అధికారులు గుర్తించారు. ఈ మేరకు స్టాక్ సీజ్ చేసి, షాపు యజమానులపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏవో పి.సురేష్, విజిలెన్స్ తహశీల్దార్ బి.కన్యాకుమారి, వ్యవసాయ శాఖ అధికారి ఆర్ఎస్.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

దుప్పట్ల పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): లయన్స్‌క్లబ్ సేవలను మరింతగా విస్తృతం చేస్తామని క్లబ్ అధ్యక్షుడు వీవీఎన్ లక్ష్మినారాయణ అన్నారు. యాగర్లపల్లి లెప్రసీ కాలనీలోని పేద ప్రజలకు క్లబ్ ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు, బిస్కెట్స్ అందజేశారు. పేదలను ఆదుకోవడంలో లయన్స్ క్లబ్ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మదన్‌మోహన్ అగర్వాల్, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పచ్చ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి అవసరం


మినుములో విత్తనశుద్ధి గురించి తెలియచేస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం: మినుము సమగ్ర సస్యరక్షణలో విత్తనశుద్ధి అవసరమని కెవికె సమన్వయ కర్త ఇ.కరుణశ్రీ అన్నారు. గురువారం మినుములో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి ప్రకాశరావుపాలెం, తెలికిచర్ల, సింగరాజుపాలెం గ్రామాల రైతులకు వివరించారు. వంబన్ 8 రకం విత్తనాన్ని ఒక్కొక్క రైతుకు ఎనిమిదికిలోల వంతున అందజేశారు. మినుము పంటలు విత్తిన తర్వాత 24 రోజుల వరకు పురుగు తాకిడిని తట్టుకొనేందుకు ఇమిడాక్లోఫిడ్ మందు ఐదు గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తనం మొత్తం కలిసేలా ఆరబెట్టిన తర్వాత విత్తాలన్నారు. తర్వాత యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో రక్షణ విభాగం శాస్త్రవేత్త చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం


పేద విద్యార్థులకు రైస్ కుక్కరు అందజేస్తున్న మానవత సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): మానవత సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. మానవత ఆధ్వర్యంలో గురువారం స్థానిక లార్డ్ ఆఫ్ లైఫ్ హోం చిల్డ్రన్ కోసం 12 లీటర్ల రైస్ కుక్కరు, రైస్ కంటైనర్ అందజేశారు. అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు కోసం దాతలు మరింత ముందుకు వచ్చి సేవలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ యర్రా ఆంజనేయ స్వామి, కోశాధికారి ఎగ్గిన శరత్, సభ్యులు రాజేంద్ర కుమార్, పాండురంగారావు, హరికుమార్, వెంకటాచలం, గురుమూర్తి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, విశాఖ ఉక్కు పరిశ్రమకు గనులు కేటాయించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర సీఐటీయూ కమిటీ ఇచ్చిన దేశ వ్యాప్త పిలుపులో భాగంగా పట్టణ సీఐటీయూ ఆధ్వర్యంలో పోలీస్ ఐలాండ్ వద్ద గురువారం రాస్తారోకో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావులు మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకానికి పెట్టి మోదీ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. చిర్ల పుల్లారెడ్డి, సత్తి కోదండరామిరెడ్డి, గొన్నాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సందడిగా నిమజ్జనోత్సవాలు


తాడేపల్లిగూడెం రూరల్: కుంచనపల్లి గ్రామంలోని గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


తాడేపల్లిగూడెం(టీటీసీ): గొల్లగూడెం రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం పలు ప్రాంతాల్లో నిమజ్జనోత్సవాలు, ఊరేగింపులు, అన్నసమారాధనలు నిర్వహించారు. గురువారం తాడేపల్లిగూడెం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నెలకొల్పిన గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. చిత్ర విచిత్ర వేషాలు, బ్యాండు మేళాల మధ్య గోదావరి ఏలూరు ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీటీసీ): గణపతి మహోత్సవ వేడుకలు పట్టణంలో గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. యాగర్లపల్లి శ్రీ సిద్ధి వినాయక మొదటి నవరాత్రి వేడుకల సందర్భంగా మండపం వద్ద స్థానిక విద్యార్థులచే పూజలు జరిపించారు. పిఠాపురం వేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు విజయ జనార్ధనాచార్యులచే విద్యార్థులకు పరీక్షల ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. వై.రాజు, ఎం.వినయ్, ఈ.వినయ్ భక్తులు పాల్గొన్నారు. స్థానిక గొల్లగూడెం సెంటర్ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక చవితి మహోత్సవాలలో గణపతి స్వామికి ఉత్సవ కమిటీ విశేష పూజలు జరిపారు. అదే విధంగా కోతిబొమ్మసెంటర్ షిర్డి సాయి మందిరం వద్ద ఏర్పాటు చేసిన ఉత్సవ పందిరి వద్ద గణపతి స్వామికి అంజనీపుత్ర ఫ్రెండ్స్ సరిల్ వారిచే విశేష పూజలు జరిగాయి. స్థానిక సంజీవనగర్ ప్రాథమిక పాఠశాల వెనుక భాగంలో ఏర్పాటు చేసిన ఉత్సవ పందిరిలో స్వామివారిని ఘనంగా ఊరేగించారు.

కార్యకర్తలకు జగనన్న కొండంత అండ

ఏపీ అప్పడా మాజీ వైస్ చైర్మన్ రఘురాం


పడమరవిప్పర్రు గ్రామంలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న వడ్డి రఘురాం, గొర్రెల శ్రీను తదితరులు

పెంటపాడు: మండలంలో కష్టించి పనిచేసే ప్రతీ కార్యకర్తకు జగనన్న నిత్యం కొండంత అండగా ఉంటారని ఏపీ అప్పడా మాజీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన పెంటపాడు మండలం పడమరవిప్పర్రు గ్రామంలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యం నుంచి కోలుకొన్న పార్టీ నాయకులు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కూటమి పాలనలో ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్లక్ష్యం వల్లే విజయవాడలో వరదల వల్ల ప్రజలు తీవ్రంగా దెబ్బతిన్నారన్నారు. వారిని ఆదుకోవాల్సింది పోయి, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ దాడులకు తెగించడం తగదన్నారు. ఈ చర్యలను మానుకోవాలన్నారు.

కార్యకర్తలతో సమావేశం

పరామర్శ అనంతరం ఆయన విప్పర్రు గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారితో చర్చించారు. వారిలో మనోధైర్యం నింపారు. రాబోయే రోజులలో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చూసేందుకు అందరం కష్టపడదామన్నారు. ఈ కార్యక్రమంలో గూడెం జెడ్పీటీసీ సభ్యులు ముత్యాల ఆంజనేయులు, రాష్ట్ర కొప్పు వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీను, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు నల్లమిల్లి విజయానందరెడ్డి, కడియద్దకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు డి.శ్రీనివాస్, గొర్రిపాటి సత్యనారాయణ, పంచాయతీ బద్రయ్య, గొల్లిపెల్లి సన్యాసిరావు, యండ అప్పారావు, యండ కొండ, మామిడి ఏసు, గుంట చంద్రశేఖర్, పైడి నరేష్, బొమ్మిడి శ్రీనివాస్, గొల్లపల్లి దుర్గరాజు, హనుమంతు రాజేష్, నాయుడు గుర్నాథం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని నార్త్ పరిధిలో వన్ టౌన్‌లో కడకట్ల కొండయ్య చెరువు సబ్ స్టేషన్ పరిధిలోను, పాతూరు సెమీ ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలోను, హౌసింగ్‌బోర్డు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కొండయ్య చెరువు, మహాలక్ష్మినగర్, రైల్వే ఫీడర్, మెయిన్ రోడ్డు ఫీడర్‌లకు సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 13వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. రామారావుపేట, హెడ్‌పోస్టాఫీస్ రోడ్డు, కర్నాల సత్రం, మహాలక్ష్మినగర్, సత్యవతినగర్, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, చెట్లు రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, జూబ్లీ రోడ్డు, కోతిబొమ్మ సెంటర్, భూపాల్‌నగర్, సిపాయి పేట, వెంకటరత్నం ఆసుపత్రి, మెయిర్ రోడ్డు, మదర్‌వన్నిని, జెడ్పీ స్కూల్ ఏరియా, శేషమహల్ ఏరియా, గణేష్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, గాంధీ బొమ్మ సెంటర్, మామిడి తోట, ఏరియా ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించారు. అదే విధంగా సౌత్ పరిధిలో టూ టౌన్‌లో పడాల ఫీడర్ పరిధిలో పడాల, పడాల గరువు, యాగర్లపల్లి, పరిసర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తణుకు టౌన్: విద్యుత్ సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఈనెల 13వ తేదీన తణుకు మండలంలోని దువ్వ, తేతలి, పైడిపర్రు, ఇరగవరం విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని తణుకు విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తణుకు మండలంలోని దువ్వ, పైడిపర్రు, పైడిపర్రు హౌసింగ్ కాలనీ, మండపాక, వేల్పూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిలుపుదల చేస్తారని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భవిత కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీటీసీ): భవిత శిక్షణ కేంద్రాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త సీహెచ్ సుబ్రహ్మణ్యం అన్నారు. ఆయన గురువారం పట్టణంలోని పెంటపాడులోని భవిత సెంటర్‌లను పరిశీలించారు. స్థానిక భవిత సెంటర్‌లో జరిగిన సమావేశంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా 2024–25 విద్యా సంవత్సరంలో పాఠశాలలో చదువుతున్న దివ్యాంగుల పిల్లల వివరాలను యాప్‌లలో నమోదు చేసి వివిధ అలవెన్స్‌లు అందరికి అందే విధంగా కృషి చేయాలన్నారు. దివ్యాంగుల పిల్లలకు కల్పిస్తున్న సదుపాయాలను పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. దివ్యాంగులకు ప్రభుత్వ పరీక్షల్లోనూ, ఉద్యోగాల్లోను రాయితీలు కల్పిస్తుందని చెప్పారు. దివ్యాంగులను ప్రతిఒక్కరూ ఆదరించాలని, విద్యాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.జ్యోతి, వెంకటలక్ష్మి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఎస్‌కే మస్తాన్‌బీ, వి.సునీత, ఎస్‌కే బాలీశ్వరయ్య, దివ్యాంగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీహెచ్ సుబ్రహ్మణ్యం

ప్రకృతి వ్యవసాయమే మేలు

తాడేపల్లిగూడెం: ప్రకృతివ్యవసాయంతో అనేక ప్రయోజనాలున్నాయని గురువారం వెంకట్రామన్నగూడెంలోని కృషి విజ్ఞానకేంద్రంలో ఐసీఏఆర్.అటారీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభమైన శిక్షణా కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. కెవికె సమన్వయకర్త ఇ.కరుణశ్రీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. దీనికి సంబంధించి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఖరీఫ్ సీజన్‌లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. నేలల్లో పోషక పదార్థాల పునరుద్ధరణకు ప్రకృతి వ్యవసాయం ఉపయోగపడుతుంది కెవికె శాస్త్రవేత్త రాఘవేంద్రరెడ్డి చెప్పారు. వర్మీ కంపోస్టు బెడ్‌లను శిక్షకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బుట్టాయిగూడెం, పోలవరం మండలాల నుంచి రైతులు పాల్గొన్నారు.


శిక్షణకు వచ్చిన వారికి కిట్లు అందజేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుని కల్యాణం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం రామతులసీ కోట సెంటర్‌లోని వినాయకుని ఆలయం వద్ద గురువారం రాత్రి శ్రీసిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామి వారి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు పీఠలపై కూర్చొని కల్యాణాన్ని జరిపించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కల్యాణాన్ని వీక్షించేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటి చైర్మన్ లక్కాకుల రంజిత్‌కుమార్, అధ్యక్షుడు లక్కాకుల శ్రీనివాస్, సభ్యుడు తారమట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాధవరంలో విఘ్నేశ్వరస్వామి వారి కల్యాణం దృశ్యం

వరద బాధితులకు ఆపన్న హస్తం


తాడేపల్లిగూడెం రూరల్: ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు విరాళం చెక్కును అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని పెదతాడేపల్లి లోటస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు విరాళాలు సేకరించారు. ఇలా సేకరించిన రూ.5.60 లక్షలు సాయం చెక్కును గురువారం తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు అందించిన సాయం వారి పెద్ద మనస్సుకు అద్దం పడుతుందన్నారు. హెచ్ఎం దేవిప్రియ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో మానవత్వ విలువలను పెంపొందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

తణుకు అర్బన్: విజయవాడ వరద ముంపు బాధితుల సౌకర్యార్థం ప్రభుత్వ సహాయ నిధికి గురువారం తణుకు కిళ్లీ, బీడీ, సిగరెట్, సోడా, కూల్‌డ్రింక్స్ వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు రూ.50వేలు చెక్కును విరాళ రూపంలో అందచేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పైబోయిన ఏసుబాబు, కార్యదర్శి సుంకర వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి బొంగు నాని, గుమ్మళ్ల హనుమంతరావు, కాసా పద్మనాభం, గంధం రామకృష్ణ, చుండూరి శేషాద్రి, పెదిరెడ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

వెంకటరమణ సేవా ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయకం

పెంటపాడు: అలంపురం వెంకటరమణ సేవాట్రస్టు ఆసుపత్రి ద్వారా పేదలకు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఆయన అలంపురంలో షిర్డీసాయిబాబాను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొలనువాడ పెదకృష్ణం రాజు ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు.